సాక్షి
అన్నమయ్య జిల్లా

బుధవారం | 8 | ఫిబ్రవరి | 2023



ఫార్మెటివ్ అసెస్‌మెంట్-3 పరీక్షలకు సర్వం సిద్ధం

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు ఎఫ్ఏ-3 పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. - 8లో



నందలూరు రైల్వే ప్రాముఖ్యతను గుర్తించాలి

రైల్వేపరంగా ప్రసిద్ధి చెందిన నందలూరు ప్రాముఖ్యతను రైల్వేబోర్డు గుర్తించాలని ఎమ్మెల్యే మల్లికార్జునరెడ్డి అన్నారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.170	రూ.220
రెండోరకం	రూ.90	రూ.168

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 136 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నవోదయ పరీక్షకు గడువు పెంపు

రాయచోటి టౌన్ : జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకోవడానికి 15వ తేదీ వరకు గడువు పెంచినట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేషనల్ గ్రీన్ స్కూల్ ప్రోగ్రామ్‌కు రెండు స్కూళ్లు

వాల్మీకిపురం : నేషనల్ గ్రీన్‌కోర్ సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఆధ్వర్యంలో 2022-23 సంవత్సరానికి నిర్వహించిన గ్రీన్ స్కూల్ ప్రోగ్రామ్‌కు అన్నమయ్య జిల్లా నుంచి రెండు స్కూళ్లు ఎంపికయ్యాయి. మన రాష్ట్రం నుంచి ఉత్తమంగా నిలిచిన 10 పాఠశాలల్లో వాల్మీకిపురం పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ములకలచెరువు మండలం బురకాయలకోట ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాల ఉండటం విశేషం. పర్యావరణానికి సంబంధించి ఈ రెండు పాఠశాలలు శ్రద్ధతో ఎక్కువ కార్యక్రమాలు చేపట్టడంతో ప్రభుత్వం ఈ అవార్డును ప్రకటించినట్లు పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అమరనాథ రెడ్డి, పర్యావరణ విభాగం ఉపాధ్యాయులు రవీంద్రారెడ్డి తెలిపారు. ఈ నెల 21, 22 తేదీల్లో న్యూఢిల్లీలో ఆయా పాఠశాలలకు సంబంధించిన ఉపాధ్యాయులు ఈ అవార్డులను అందుకోనున్నారు. జాతీయ స్థాయి అవార్డులను కైవసం చేసుకున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి, ఉప విద్యాశాఖ అధికారులు క్రిష్టప్ప, వరలక్ష్మి, రాష్ట్ర ఎన్జీసీ కో-ఆర్డినేటర్ నీలకంఠ, జిల్లా ఎన్జీసీ కో-ఆర్డినేటర్ చక్రధర్ రాజు తదితరులు అభినందించారు.

జిల్లా ఆస్పత్రిలో డీఎన్‌బీ ప్రతినిధి పరిశీలన



జిల్లా ఆస్పత్రిలో మెడికల్ సూపరింటెండెంట్‌తో చర్చిస్తున్న డీఎన్‌బీ ప్రతినిధి డాక్టర్ సచిన్

మదనపల్లె : స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని డిప్లమేట్ ఆఫ్ నేషనల్‌బోర్డ్(డీఎన్‌బీ) ప్రతినిధి డాక్టర్.సచిన్ మంగళవారం సందర్శించారు. ఫ్యామిలీ మెడిసిన్ పీజీ సీటు మంజూరు ప్రతిపాదనలు అందడంతో ఆయన ఆస్పత్రిలోని సౌకర్యాల పరిశీలనకు వచ్చారు. ఆస్పత్రిలోని వసతులు, అందిస్తున్న సేవలు, ఇన్, ఔట్ పేషంట్లు అందుబాటులోని డాక్టర్లు, వైద్య పరికరాలు, ఇతర అంశాలపై క్షేత్రస్థాయిలో విచారణ చేసి నివేదికలు తయారుచేస్తామన్నారు. వివరాలను పరిశీలించి బోర్డు పీజీ సీటు మంజూరుచేస్తుందన్నారు. కార్యక్రమంలో మెడికల్ సూపర్‌వైజర్ పద్మాంజలిదేవి, ఆర్‌ఎంఓ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప కల్చరల్ : కడప నగరంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ప్రధాన కార్యాలయంలో మెడికల్ ఆఫీసర్ పోస్టుకు ఆసక్తి, అర్హత గలవారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని స్పెషల్ ఆఫీసర్ సి.సాయిగ్రేస్ తెలిపారు. వైద్యశాస్త్రంలో పీజీ డిగ్రీ, ఎండీ ప్యాథాలజీ, ట్రాన్స్‌ఫ్యూషన్ మెడిసిన్ కలిగి ఉండాలని లేదా వైద్యశాస్త్రంలో డిగ్రీ, పైథాలజీలో డిప్లొమా, ట్రాన్స్‌ఫ్యూషన్ మెడిసిన్‌లో తగిన అవగాహన, బ్లడ్ గ్రూపింగ్ సిరాలజీ, మెథడాలజీ, కాంపోనెంట్స్ ప్రిపరేషన్ చేయగలిగి ఉండాలని సూచించారు. అర్హులైన వారు పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను ఈనెల 15వ తేదీ సాయంత్రం 5.00 గంటల్లోగా నగరంలోని మట్టిపెద్దపులి వద్ద గల రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో నేరుగా అందజేయాలన్నారు. ఎంపికైన అభ్యర్థికి రూ. 30 వేల వేతనం ఉంటుందని, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగే సమావేశంలో అభ్యర్థి ఎంపిక ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 08562-272829 నంబరులో సంప్రదించాలన్నారు.



ఎర్రబంగారం.. విక్రయానికి సన్నాహం

- ఏపీఎఫ్‌డీసీ ద్వారా గ్లోబల్ టెండర్లు
- గోడౌన్‌లో సిద్ధంగా ఉన్న 10వేల టన్నుల నిల్వలు
- 5300 టన్నులు విక్రయానికి సిద్ధం
- ఖజానాకు చేరనున్న కోట్లాది రూపాయలు
- అందులో 30 శాతం ఎర్రచందనం అడవుల రక్షణ కోసం వెచ్చింపు



సాక్షి ప్రతినిధి, కడప : అంతర్జాతీయ స్థాయిలో అత్యంత విలువైన ఎర్రచందనం విక్రయానికి సన్నాహాలు ఆరంభమయ్యాయి. కోట్లాది రూపాయల విలువైన ఎర్రబంగారం సంవత్సరాల తరబడి గోడౌన్‌కు పరిమితమైంది. ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాలలో స్మగ్లర్ల నుంచి స్వాధీనం చేసుకున్న ఎర్రచందనాన్ని విక్రయించేందుకు ఐదేళ్ల క్రితం అధికార యంత్రాంగం సిద్ధమైంది. కడప పరిధిలో ఉన్న ఎర్రచందనాన్ని డ్రెస్సింగ్ చేసి తిరుపతికి తరలించారు. రెండు జిల్లాలకు చెందిన ఎర్రచందనం నిల్వలు 10వేల టన్నులు పైబడి సిద్ధంగా ఉన్నాయి. అందులో తొలి విడతగా 5300 టన్నులు విక్రయించాలని ఫారెస్టు యంత్రాంగం నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్ ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎఫ్‌డీసీ) ద్వారా గ్లోబల్ టెండర్లు ఆహ్వానించేందుకు ప్రక్రియ ప్రారంభించారు. వృథాగా పడిఉన్న ఎర్రచందనం నిల్వలను విక్రయించాలనే ఆలోచన గత ఐదేళ్లుగా కొనసాగుతోంది. 2014 నుంచి పట్టుబడ్డ ఎర్రచందనాన్ని డ్రెస్సింగ్ చేసి తిరుపతికి తరలించి ప్రత్యేక గోడౌన్లలో ఉంచి భద్రపర్చారు. గ్లోబల్ టెండర్ల ద్వారా విక్రయించాలని అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రక్రియ ప్రారంభించింది. గ్లోబల్ టెండర్ల నిర్వహణకు అన్ని అనుమతులు పూర్తి చేసుకున్నట్లు అధికార యంత్రాంగం వివరిస్తోంది. ఆమేరకు ఈ ఆర్థిక సంవత్సరం పూర్తయ్యేలోపు విక్రయించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

రూ.500 కోట్లు ఆదాయం..

గ్లోబల్ టెండర్ల ద్వారా తొలివిడతలో విక్రయానికి పెట్టిన ఎర్రచందనం నిల్వలతో సుమారు రూ.500 కోట్లు ఆదాయం ఖజానాకు దక్కవచ్చని అధికారులు అంచనా వేశారు. గ్లోబల్ టెండర్లలో పోటీ అధికంగా ఉంటే మరింత అదనంగా ఆదాయం రానున్నట్లు లెక్కకట్టారు. ప్రస్తుతం ఏ గ్రేడ్ ఎర్రచందనం రూ.2కోట్లు తక్కువ లేకుండా ధర పలకనున్నట్లు సమాచారం. బి గ్రేడ్ రూ.1కోటి, సి గ్రేడ్ రూ.50 లక్షలు ధర దక్కుతోందనేది అంచనా. ప్రస్తుత నిల్వల్లో సరాసరిగా పరిశీలిస్తే రూ.500 కోట్లకు తక్కువ కాకుండా ఖజానాకు సమకూరనున్నట్లు తెలుస్తోంది.

ఎర్రచందనం రక్షణ కోసం..

గ్లోబల్ టెండర్ల ద్వారా లభించే ఆదాయంలో నిబంధనల ప్రకారం 30శాతం ఎర్రచందనం అడవుల రక్షణ కోసం కేటాయించాల్సి ఉంది. ప్రస్తుత అంచనా ఆధారంగా ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాలకు సుమారు రూ.75 కోట్లు అడవుల రక్షణకు నిధులు దక్కనున్నట్లు ఫారెస్టు యంత్రాంగం పేర్కొంటోంది.



చేనేతల అభివృద్ధికి సహకరించండి

కేంద్ర టెక్స్‌టైల్ సెక్రటరీ రచ్‌నాషాను కోరిన ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



కేంద్ర టెక్స్‌టైల్ సెక్రటరీ రచ్‌నాషాకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి : న్యూఢిల్లీలో కేంద్ర టెక్స్‌టైల్ సెక్రటరీ రచ్‌నాషాను ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిలు కలిసి అన్నమయ్య జిల్లా అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా చర్చించారు. మంగళవారం ఢిల్లీలోని ఆమె కార్యాలయంలో కలిసి అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో చేపట్టాల్సిన ప్రధాన అభివృద్ధి పనులను వినతి పత్రం ద్వారా వివరించారు. రాయచోటి జిల్లా కేంద్రం అయిందని, నేషనల్ హైవే సమీపంలో 13 ఎకరాల భూమిని శిల్పారామానికి కేటాయించామన్నారు. ఈ ప్రాంతంలో చేతివృత్తులు, చేనేతల వారు అధికంగా ఉన్న విషయాన్ని ఆమె దృష్టికి తెచ్చారు. వీటిని దృష్టిలో ఉంచుకుని అర్బన్ హట్, షాపింగ్ కాంప్లెక్స్ తరహా నిర్మాణాలు చేపట్టి చేతివృత్తుల వారికి ఉపాధి కల్పించాలన్నారు. అలాగే చేనేతలకు అండగా ఉండి ప్రోత్సహించే అవకాశం ఉంటుందన్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని కోరారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను ఆమెకు అందజేశారు. దీనిపై స్పందించిన ఆమె శిల్పారామం కోసం స్థలసేకరణ పూర్తయినందున అనుమతులు ఇస్తామని ఆమె హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

పంచాయతీల రికార్డుల పరిశీలన



పెనగలూరులో పంచాయతీ రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి

పెనగలూరు : మండలంలోని లోకాయుక్త పరిధిలో ఉన్న 8 పంచాయతీలలో రికార్డులు పరిశీలించినట్లు జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో కొండూరు, కట్టావారిపల్లె, సిద్దవరం, సింగారెడ్డిపల్లె, ఎస్ఆర్ పురం పంచాయతీల రికార్డులు, బిల్లులను ఆయన పరిశీలించారు. సర్పంచ్‌లు రాకముందు స్పెషల్ అధికారుల పాలనలో ఉన్న పంచాయతీలలో పంచాయతీ నిధులు అవకతవకలు జరిగాయని.. గతేడాదిలో పెనగలూరుకు చెందిన కోడూరు మల్లికార్జున 8 పంచాయతీలపై లోకాయుక్తలో కేసు వేశారు. సిద్దవరం పంచాయతీలో రూ. 15,89,196, జనరల్ ఫండ్ రూ.1,18,920, ఎస్ఆర్ పురంలో రూ. 1,29,240, కొండూరులో రూ.2,77,447, కట్టావారిపల్లిలో రూ.1,91,835, సింగారెడ్డిపల్లి పంచాయతీలో రూ.18,98,953, జనరల్ ఫండ్ కింద రూ.94,900 అవకతవకలు జరిగినట్లు లోకాయుక్త కోర్టులో వేశారు. ఐదు పంచాయతీలతో పాటు ఓబిలి, నల్లపరెడ్డిపల్లి, పెనగలూరు పంచాయతీలలో కూడా అవకతవకలు జరిగినట్లు కోర్టులో వేశారు. 8 పంచాయతీలపై స్పెషల్ ఆఫీసర్ పాలనలో ఉన్న బిల్లులను, ఎం బుక్‌లను తనిఖీ చేయాలని కోర్టు నుంచి ఆదేశాలు వచ్చాయని సీఈఓ తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీల రికార్డులను పరిశీలించగా మంగళవారం ఐదు పంచాయతీలకు సంబంధించిన రికార్డులు మాత్రం పూర్తి చేశామన్నారు. అందులో ఎలాంటి పొరపాట్లు లేవని, చిన్న సమస్యలు తప్పా ఎక్కడా అవకతవకలు జరిగినట్లు ఆధారాలు లేవన్నారు. పనులు చేసిన క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించడం సాధ్యం కాదని, అందుకే రికార్డు పరంగా ఓచర్లు, బిల్లులను పరిశీలించినట్లు తెలిపారు. మిగిలిన మూడు పంచాయతీలలో మరొక్క రోజు సమయం కేటాయించి రికార్డులను పరిశీలిస్తామన్నారు. ఈ నెల 28లోపు మరో మూడు పంచాయతీలను కూడా తనిఖీ చేసి కోర్టుకు పూర్తి వివరాలు సమర్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఏఓ రంగాచారి, సిబ్బంది యశ్వంత్, సునీల్, ఈఓపీఆర్‌డీ సుధాకర్‌రెడ్డి, ఎంపీడీఓ ఏఓ పద్మభూషణ్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమణ, పీఆర్‌ఏఈ గంగులయ్య, ఏపీఓ మురళీ తదితరులు పాల్గొన్నారు.

మంగంపేట బెరైటీస్
భూసేకరణ వేగవంతం

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



మంగంపేట బెరైటీస్ గనుల పురోగతిపై అధికారులతో సమీక్ష చేస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : ప్రపంచంలోనే ప్రఖ్యాతిగాంచిన మంగంపేట బెరైటీస్ ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మంగంపేట బెరైటీస్ ప్రాజెక్టుకు భూసేకరణ వేగవంతం, పురోగతిపై ఏపీఎండీసీ, రాజంపేట సబ్‌కలెక్టర్, సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగంపేట బెరైటీస్ ప్రాజెక్టుకు సంబంధించి ఆర్ అండ్ ఆర్‌కు ఎన్ని కోట్లు ఖర్చు చేశారు.. ఇప్పటి వరకు నష్టపరిహారం ఎంత ఇచ్చారు.. ఎంత అవార్డు పాస్ చేశారు.. ఇంకా ఎంత అవార్డు చేయాల్సి ఉంది వంటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆర్ అండ్ ఆర్ ప్రతిపాదనలు త్వరగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూసేకరణకు సంబంధించి వారంలోగా నిధులు జమచేయాలని ఏపీఎండీసీ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ తమీమ్‌అన్సారియా, రాజంపేట సబ్‌కలెక్టర్ ఫర్మాన్‌అహమ్మద్‌ఖాన్, ఏపీఎండీసీ అధికారులు, ఓబులవారిపల్లె తహసీల్దార్ పీరుమున్నీ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణలో స్కౌట్స్ అండ్ గైడ్స్ కీలక పాత్ర

విద్యార్థుల్లో క్రమశిక్షణ, సరైన లక్షణాలను పెంపొందించడంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రధాన పాత్ర పోషిస్తోందని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అభిప్రాయపడ్డారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్‌ను జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీకర్‌లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులలో క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడం ద్వారా మంచి పౌరులుగా తీర్చిదిద్దేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంతగానో దోహదపడుతుందన్నారు.

10న మెగా జాబ్ మేళా

అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె ప్రభుత్వ బీటీ కళాశాల ఆవరణంలో ఈనెల 10వ తేదీన మెగా జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. మంగళవారం ఆయన తన ఛాంబర్‌లో మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ ఉదయం 10 గంటలకు మదనపల్లెలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ మెగా జాబ్ మేళా నిర్వహిస్తోందన్నారు. రాష్ట్రంలోని వివిధ బహుళ జాతీయ కంపెనీలకు సంబంధించిన 50 నుంచి 60 కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నారన్నారు. ఇప్పటి వరకు 8 వేల మంది అభ్యర్థులు తమ పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. ఎంపీ మిథున్ రెడ్డి, మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్ బాషా ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళాకు దాదాపు 10వేల మందికి పైగా నిరుద్యోగ యువత హాజరయ్యే విధంగా ఏర్పాట్లు చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి హరికృష్ణ, సీడాప్ మేనేజర్ వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ గోస.. పోలీసు భరోసా

- గల్ఫ్ దేశాలకు ఉపాధి నిమిత్తం వెళ్లిన వారిలో పలువురికి ఇబ్బందులు
- వీరి బాగోగులు పట్టించుకోని సేఠ్‌లు
- కొన్ని సందర్భాల్లో కుటుంబ సభ్యులతో సంబంధాలు లేక నరకయాతన
- గల్ఫ్ బాధితులను ఆదుకునే దిశగా జిల్లా ఎస్పీ కార్యాచరణ
- జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూము ఏర్పాటుకు చర్యలు



సాక్షి,రాయచోటి : ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళుతున్న వారి బతుకు భరోసాకు పోలీసుశాఖ ప్రత్యేక చర్యలకు ఉపక్రమించింది. ఉపాధి కోసం అక్కడికి వెళ్లిన తర్వాత ఆయా దేశాల్లో ఇబ్బందులు ఎదురవుతున్న తరుణంలో వాటిని అధిగమించేందుకు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ప్రత్యేక చర్యలకు నాంది పలికారు. ఇక్కడి నుంచి వెళ్లే ప్రజలకు పూర్తి స్థాయిలో అవకాశాలు కల్పించడంతోపాటు.. అక్కడ విపత్కర పరిస్థితులు ఎదురైనా రక్షణగా నిలిచేందుకు ఒక కంట్రోలు రూమును కూడా ఏర్పాటు చేసే దిశగా ఎస్పీ అడుగులు వేస్తున్నారు. అన్నమయ్య జిల్లాలోని రాజంపేట, రైల్వే కోడూరు, రాయచోటి, పీలేరు తదితర నియోజకవర్గాల్లో అనేక మంది ఉపాధి నిమిత్తం కొన్నేళ్లుగా గల్ఫ్ దేశాలకు వెళుతూ వస్తున్నారు. అయితే అక్కడ గత కొన్నేళ్లుగా ఇబ్బందులు పడుతున్న సంఘటనలు పోలీసుశాఖ దృష్టికి రావడంతో ఎస్పీ వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

ఇతర దేశాల్లో ఇబ్బందులు

జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఇప్పటికే సుమారు 30 వేల మందికి పైగా గల్ఫ్ దేశాల్లో ఉపాధి పొందుతున్నారు. ప్రధానంగా కువైట్, సౌదీ అరేబియా, దుబాయ్, మస్కట్, ఖత్తర్, బెహరీన్ తదితర దేశాల్లో డ్రైవర్లు, కార్మికులు, వివిధ సంస్థల్లో ఉద్యోగులు, ఇంటిపని వారీగా విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే ఇక్కడి నుంచి వెళ్లిన తర్వాత అక్కడ అనేక రకాల సమస్యలు ఉత్పన్నమై కుటుంబీలతో బంధాలు తెగిపోతున్నాయి. కొంతమంది అక్కడ భాషతోపాటు ఉపాధి సమస్య కూడా తలెత్తి సేఠ్‌ల ఇళ్లలో మగ్గిపోయి ఇబ్బందులు ఎదుర్కొన్న వారు లేకపోలేదు. తర్వాత భారత రాయబార కార్యాలయంతోపాటు ప్రజాప్రతినిధుల ఒత్తిడి మేరకు ఎలాగోలా స్వదేశం చేరుతున్నారు.

బాధితులకు భరోసా కల్పించేలా కంట్రోల్ రూము

విదేశాల్లో ఉండి ఇబ్బందులు పడుతున్న వారికోసం జిల్లా పోలీసు కార్యాలయంలో ఒక కమాండ్ కంట్రోల్ రూమును ఏర్పాటు చేయాలని భావించి ఆ దిశగా అడుగులు ముందుకు వేస్తున్నారు. నేరుగా ఒక నంబరును కేటాయించి బాధితుల సమస్యలను తెలుసుకునేందుకు కొంతమంది సిబ్బందిని కూడా నియమించనున్నారు. బాధితులకు భరోసా కల్పించి తర్వాత సంబంధిత ఏజెంటు ద్వారా పూర్తి వివరాలు తెలుసుకుని.. అవసరమైతే అక్కడి ఏజెంట్ల ద్వారా సేఠ్‌తో చర్చించి ఇక్కడికి రప్పించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. పరాయి దేశంలో ఇబ్బందులు పడుతున్న వారికి 'మేమున్నామని భరోసా కల్పించడమే' ధ్యేయంగా పోలీసు శాఖ చర్యలు చేపడుతోంది.

ఏజెంట్లకూ దిశా నిర్దేశం

అన్నమయ్య జిల్లా నుంచి ఇతర దేశాలకు ఉపాధి నిమిత్తం పలువురిని పంపించే ఇక్కడి ఏజెంట్లతో కూడా ఇటీవల ఎస్పీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నిబంధనల మేరకే ఇక్కడి వారిని గల్ఫ్ దేశాలకు పంపాలని, అక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఏజెంట్లకు దిశా నిర్దేశం చేశారు. అలాగే ఇక్కడి నుంచి ప్రజలను పంపించే సమయంలో అన్ని రకాల రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే ఏజెంట్లు అవసరమైన సమయంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని చెప్పారు. విదేశాలకు వెళ్లిన వారు అక్కడ బాధపడుతుంటే ఇక్కడ వారి కుటుంబాల్లో నెలకొనే ఆందోళనను దృష్టిలో ఉంచుకోవాలని పేర్కొన్నారు.

విదేశాలకు వెళ్లే వారు జాగ్రత్తలు పాటించాలి



ఉద్యోగ, ఉపాధి నిమిత్తం గల్ఫ్‌తోపాటు ఇతర దేశాలకు వెళ్లేవారు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అవసరమైతే భాష సమస్య ఉత్పన్నం కాకుండా అవగాహన కలిగి ఉండాలి. విజిటింగ్ వీసాతో అక్కడికి వెళ్లి ఇబ్బందులు పడకుండా ఉపాధి పేరుతోనే వీసా తీసుకుని వెళ్లేలా చర్యలు చేపట్టాలి. నిబంధనలు పాటిస్తే సాధ్యమైనంత వరకు అక్కడ ఎలాంటి సమస్యలు ఎదురు కాకపోవచ్చు. ఏజెంట్లు కూడా ఇక్కడి నుంచి పంపించే విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. విదేశాలకు వెళ్లిన తర్వాత అక్కడ ఏదైనా ఇబ్బంది ఎదురైనా వారికి అండగా నిలబడాలి.

– వి.హర్షవర్ధన్‌రాజు, ఎస్పీ, అన్నమయ్య జిల్లా

విద్యార్థుల కోసం ప్రత్యేక ఆధార్ క్యాంపులు



మాట్లాడుతున్న మనోహర్‌రాజు

రాయచోటి అర్బన్ : ఇంటర్మీడియట్ విద్యార్థులు ఆధార్‌కార్డులలో బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేసుకునేందుకు ప్రత్యేక క్యాంపులను నిర్వహిస్తున్నట్లు గ్రామ,వార్డు సచివాలయాల జిల్లా అధికారి మనోహర్‌రాజు తెలిపారు. ఈనెల 7వతేదీ మంగళవారం నుంచి 10వ తేదీ వరకు 4రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా 132 జూనియర్ కళాశాలల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కనీసం 10 ఏళ్ల వ్యవధిలో ఒక్కసారైనా ప్రతిఒక్కరూ తమ ఆధార్ కార్డులో బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలన్న నిబంధనలను యూఐడీఏఐ తీసుకువచ్చిందన్నారు. జిల్లాలో పదేళ్ల వ్యవధిలో ఒక్కసారి కూడా తమ ఆధార్‌కార్డులో బయోమెట్రిక్ వివరాలను నమోదు చేసుకోని వారు దాదాపు 24,667మంది ఉన్నారని తెలిపారు. 7 నుంచి 17 సంవత్సరాల వయస్సువారికి ప్రభుత్వం పూర్తి ఉచితంగా బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేసుకునే అవకాశం కల్పిస్తోందన్నారు. సచివాలయాల్లో నిర్వహించే ప్రత్యేక ఆధార్ క్యాంపులలో ఆధార్ కార్డుల్లో బయోమెట్రిక్ అప్‌డేట్ సేవలను ఉచితంగా అందించడంతో పాటు నిర్ణీత రుసుంతో అదనంగా మరో 10 రకాల ఆధార్‌సేవలను పొందేందుకు అకాశం ఉందన్నారు. విద్యార్థులు ప్రత్యేక ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు

రాయచోటిటౌన్ : రాయచోటి నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మంగళవారం రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు స్వగృహంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో నాయీ బ్రాహ్మణులను ట్రస్టీలుగా నియమించాలని ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. బీసీలకు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సముచిత న్యాయం జరుగుతోందని చెప్పేందుకు ఇదొక నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘం నాయకుడు, శ్రీ వీరభద్రస్వామి ఆలయ భజంత్రీ వీరబల్లె మోహన్, శ్రీ వీరభద్రస్వామి ఆలయ కమిటీ సభ్యులు బి. విజయ భాస్కర్, నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు భూషణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మదనపల్లెలో రూ.1.49 కోట్లకు ఐపీ

మదనపల్లె : మదనపల్లెలో తల్లి, కొడుకులు రూ.1.49 కోట్లకు ఇన్‌సాల్వెన్సీ పిటిషన్ (ఐపీ) దాఖలు చేసిన సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసింది. పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన కె.రమాదేవి, ఆమె కుమారుడు కె.యాదగిరి మెడికల్, ట్రాన్స్‌పోర్ట్, జనరల్ స్టోర్, చిట్టీలు తదితర వ్యాపారాలు నిర్వహిస్తుండే వారు.


ఈక్రమంలో పట్టణంలోని పలువురి వద్ద అప్పులు చేశారు. వ్యాపారంలో నష్టాలు రావడంతో సకాలంలో అప్పులు చెల్లించలేకపోయారు. దీంతో రుణదాతల ఒత్తిడులు, వేధింపులు అధికమవడంతో భరించలేక తల్లి, కొడుకు కలిసి ఇటీవల మదనపల్లె ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో రూ.1.49 కోట్లకు ఐపీ దాఖలు చేశారు. దీంతో రుణదాతలు ఆందోళన చెందుతున్నారు.

వాహనాల స్పెషల్ డ్రైవ్‌లో 230 కేసులు

కడప అర్బన్ : జిల్లాలో పోలీసులు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో మంగళవారం మొత్తం 230 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలియజేశారు. ఇందులో ప్రధానంగా హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపిన 222 మందిపై, సీటు బెల్ట్ ధరించకుండా వెళుతున్న కార్లు, జీపులు, తదితర వాహనాలకు సంబంధించి 8 మందిపై కేసులు నమోదు చేశారు.

ఫార్మెటివ్ అసెస్‌మెంట్-3 పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ అధికారులు
- పాఠశాలలకు గంట ముందు ప్రశ్నాపత్రం అందజేత



పరీక్షకు సిద్ధమౌతున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : వైఎస్సార్ ఉమ్మడి జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఫార్మెటివ్ అసెస్‌మెంట్-3(ఎఫ్ఏ-3) పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర విద్యా పరిశోధన మండలి విడుదల చేసింది. ఈ పరీక్షలను ఈ నెల 10వ తేదీ వరకు రెండు పూటలా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను, ఓఎంఆర్ షీట్స్‌ను కడప డీసీఈబీ నుంచి అన్ని మండల విద్యాశాఖ కార్యాలయాలకు చేరవేశారు. సంబంధిత ప్రశ్నాపత్రాలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తేదీల వారీగా ఎమ్మార్సీ కార్యాలయంలోని ట్రంక్ పెట్టెల్లో భద్రపరచుకోన్నారు. పరీక్షల ప్రశ్నాపత్రాలను ఏ రోజుకారోజున ఒక గంట ముందు మాత్రమే.. ప్రధానోపాధ్యాయులు తీసుకెళ్లాలి. ప్రశ్నాపత్రాల లీకేజీకి తావు లేకుండా అన్ని జాగ్రత్తలను తీసుకున్నారు.

3,89,682 మంది విద్యార్థులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కలుపుకొని 3,89,682 మంది విద్యార్థులు ఈ ఫార్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్షను రాయనున్నారు. ఇందులో 1వ తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థులకు క్లాస్ రూమ్ బేస్ అసెస్‌మెంట్ విధానంలో ఓఎమ్మార్ షీట్‌లో పరీక్షను రాయాల్సి ఉండగా.. మిగతా 9, 10 తరగతుల పరీక్షలను మ్యానువల్ పద్ధతిలో నిర్వహించనున్నారు. ఇందులో 1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఉదయం సెషన్‌లో 10 గంటల నుంచి 11 వరకు మధ్యాహ్న సెషన్‌లో 2 నుంచి 3 వరకు పరీక్ష ఉంటుంది. అలాగే 6, 7, 8 తరగతులకు మాత్రం మొదటి సెషన్‌లో మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 వరకు, రెండవ సెషన్‌లో 3 నుంచి 4 వరకు ఉంటుంది. అలాగే 9, 10 తరగతులకు ఉదయం మొదటి సెషన్‌లో 9.30 నుంచి 10.15 వరకు, రెండవ సెషన్‌లో 11 నుంచి 11.45 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.

1 నుంచి 5వ తరగతి వరకు		
పరీక్ష తేదీ	సెషన్-1	సెషన్ 2
	10 ఏఎం-11ఏఎం	2 పీఎం-3 పీఎం
8.2.23	తెలుగు	మ్యాథ్స్
9.2.23	ఇంగ్లీషు	ఎన్విరాన్‌మెంట్ సైన్స్
6 నుంచి 8వ తరగతి వరకు		
పరీక్ష తేదీ	సెషన్-2	సెషన్-2
	1.30 పీఎం-2.30 పీఎం	3 పీఎం-4 పీఎం
8.2.23	తెలుగు	మ్యాథ్స్
9.3.23	హిందీ	జనరల్ సైన్సు
10.2.23	ఇంగ్లీషు	సోషియల్ స్టడీ
9, 10 తరగతులు		
పరీక్ష తేదీ	సెషన్-2	సెషన్ -2
	9.30 ఏఎం-10.15 ఏఎం	11 ఏఎం - 11.45 ఏఎం
8.2.23	తెలుగు	మ్యాథ్స్
9.2.23	హిందీ	జనరల్ సైన్సు
10.2.23	ఇంగ్లీషు	సోషియల్ స్టడీ

ఎంఈఓ కార్యాలయాలకు

ఫార్మెటివ్ అసెస్‌మెంట్-3 పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ సీటు లను అన్ని మండల కేంద్రాలకు చేర్చాము. వాటిని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తేదీల వారీగా ట్రంకు పెట్టెల్లో భద్రపరచుకోవాలి. పరీక్ష ప్రారంభానికి గంట ముందు మాత్రమే ప్రశ్నాపత్రాలను ప్రధానోపాధ్యాయులకు అందజేయాలి.



– శోభారాణి, డీసీఈబీ సెక్రటరీ, కడప

ఆరోపణలకు తావులేకుండా

జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఫార్మెటివ్ అసెస్‌మెంట్-3 పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలి. ఎక్కడా ఎలాంటి ఆరోపణలకు తావులేకుండా ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకుని జరపాలి. పొరపాట్లు జరిగితే చర్యలు కఠినంగా ఉంటాయి.



– చెప్పలి దేవరాజు, జిల్లా విద్యాశాఖ అధికారి, వైఎస్సార్ జిల్లా

మార్కెట్ యార్డులో బోరుపైపులు చోరీ

గుర్రంకొండ : గుర్రంకొండ మార్కెట్‌యార్డులోని రేకుల షెడ్డులో బోరు పైపులతోపాటు ఇతర వ్యవసాయ పనిముట్లు సోమవారం రాత్రి చోరీకి గురయ్యాయి. గ్రామానికి చెందిన ఎస్‌డీఎస్ గయాజ్ అహ్మద్ స్థానిక మార్కెట్‌యార్డులో రేకుల షెడ్డు వేసుకొని, అందులో బోరుపైపులతోపాటు ఇతర వ్యవసాయ పనిముట్లు ఉంచాడు. గత రాత్రి రేకుల షెడ్డు వెనుకవైపు రేకులను తొలగించి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. 20 బోరుపైపులు, గడ్డపారలు, పారలు, గోలాలు, లావుతాళ్లు, టమాట క్రేట్లు, ఒక సైకిల్ చోరీకి గురైనట్లు బాధితుడు పేర్కొన్నాడు. వాటి విలువ రూ.70 వేలు ఉంటుందని తెలిపాడు. ఈ మేరకు మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు బోల్తా.. ముగ్గురికి గాయాలు

చాపాడు : ప్రొద్దుటూరు – మైదుకూరు జాతీయ రహదారిలోని చాపాడు మండలం విశ్వనాథపురం గ్రామం వద్ద మంగళవారం కారు బోల్తా పడింది. ప్రకాశం జిల్లాకు చెందిన వినయ్, బాబు, ధర్మేంద్ర పెళ్లి పత్రికలు ఇచ్చేందుకు కారులో పులివెందుల వెళ్లి మైదుకూరు వస్తున్నారు. ఈ క్రమంలో విశ్వనాథపురం వద్ద రోడ్డుపై ఎదురుగా వస్తున్న గేదెలను తప్పించబోయి కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణించే ముగ్గురు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. చాపాడు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

నందలూరు రైల్వే ప్రాముఖ్యతను గుర్తించాలి

- లోక్‌సభలో ప్రకటించిన మేరకు పరిశ్రమ ఏర్పాటు చేయాలి
- రైల్వే బోర్డుకు ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి లేఖ



రైల్వే బోర్డుకు లేఖ రాస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

రాజంపేట : బ్రిటిష్ కాలం నుంచి ఉభయ జిల్లాలో రైల్వేపరంగా ప్రసిద్ధి చెందిన నందలూరు ప్రాముఖ్యతను రైల్వేబోర్డు గుర్తించాలని రాజంపేట శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. ఐకేపీఎస్ చేపట్టిన సంతకాల సేకరణ ఉద్యమంలో భాగంగా మంగళవారం మేడాభవన్‌లో ఎమ్మెల్యేని కలిసి మద్దతు కోరుతూ రైల్వేబోర్డుకు అందించేందుకు ఎమ్మెల్యే లేఖను కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత యూపీఏ పాలనలో అప్పటి రైల్వే మంత్రిత్వశాఖ లాలూప్రసాద్ యాదవ్ లోక్‌సభలో నందలూరు రైల్వే కేంద్రంలో రైల్వేపరమైన పరిశ్రమను ఏర్పాటు చేస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. ఆ ప్రకటనను రైల్వే మంత్రిత్వశాఖ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ ఉన్న స్టీమ్ ఇంజన్‌లోకోషెడ్ ఎత్తివేసిన తరుణంలో ప్రత్యామ్నాయ పరిశ్రమను ఏర్పాటు చేయాల్సి ఉండాల్సిందన్నారు. వ్యాగిన్ రిపేర్ వర్క్‌షాపు, రిహాబిటేషన్ వర్క్‌షాపును ఏర్పాటు చేసే ప్రతిపాదనలు ఇతర ప్రాంతాలకు దారిమళ్లాయని ఆవేదన చెందారు. రాజంపేట లోక్‌సభ సభ్యుడు మిథున్‌రెడ్డి కూడా లోక్‌సభలో నందలూరు రైల్వేకి ఉన్న ప్రాముఖ్యతను తెలియజేశారన్నారు. నందలూరు రైల్వే పూర్వవైభవం కోసం ఎంపీ తన వంతుగా కృషి చేస్తున్నారన్నారు. అనేక మార్లు రైల్వేమంత్రిత్వ శాఖను కలిసి నందలూరు, రాజంపేటలో రైళ్ల స్టాపింగ్స్ కోసం కోరారన్నారు. నందలూరు రైల్వేకేంద్రాన్ని ఆదాయపరంగా కాకుండా చరిత్ర పరంగా గుర్తించి అన్ని రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత రైల్వే మంత్రిత్వశాఖకు ఉందన్నారు. కరోనా కంటే ముందు రైళ్లకు ఉన్న హాల్టింగ్‌ను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఐకేపీఎస్ నేతలు మస్తానయ్య, ఆర్ముగంవిశ్వనాథ్, జుల్ఫీకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం మదనపల్లె మండలంలో జరిగింది. పట్టణంలోని బుగ్గకాలువలో నివాసం ఉంటున్న తల్లి అలివేలమ్మ(80), కుమారుడు శంకర(50) కలిసి ద్విచక్రవాహనంలో సీటీఎం సమీపంలో లీజుకు తీసుకున్న సపోటా తోట వద్దకు కాపలాగా ఉండేందుకు వెళ్తుండగా.. మార్గంమధ్యలో ఐదోమైలు వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తల్లీకుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. శంకర పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతి రుయాకు తరలించారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడిని ఏమార్చి.. ఏటీఎం కార్డు మార్చి..

రూ.44 వేలు కాజేసిన వైనం

కడప అర్బన్ : కడప నగరం రైల్వేస్టేషన్ సమీపంలో నివాసముంటున్న రిటైర్డ్ ఆర్‌అండ్‌బీ ఉద్యోగి సుబ్బన్నను ఓ వ్యక్తి ఏమార్చి ఏటీఎం కార్డు మార్చి రూ.44 వేలు కాజేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. విశ్వేశ్వరయ్య సర్కిల్ సమీపంలో ఇటీవల ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలో డబ్బులను డ్రా చేసేందుకు సుబ్బన్న వెళ్లాడు. ఆ ఏటీఎం మిషన్ వద్దనే మరో గుర్తుతెలియని వ్యక్తి అప్పటికే ఉన్నాడు. వృద్ధుడిని ఏమార్చి ఏటీఎం కార్డు తీసుకుని నగదు కాజేసి, తన ఏటీఎం కార్డును వృద్ధునికి ఇచ్చి ఎంచక్కా అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తర్వాత వివిధ ఏటీఎం కేంద్రాలకు వెళ్లి పలు దఫాలుగా మొత్తం రూ.36 వేలు డ్రా చేశాడు. మరుసటిరోజు రూ.8 వేలు డ్రా చేశాడు. దీంతో వృద్ధుడు సుబ్బన్న తన సెల్‌ఫోన్‌కు పదేపదే మెసేజ్‌లు రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నగర పంచాయతీలో అక్రమాలపై తనిఖీలు

బి.కొత్తకోటలో ఆర్‌డీడీ, ఆడిటర్ల పరిశీలన



ఆడిటర్లు, కమిషనర్‌తో కలిసి రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌డీడీ మూర్తి

బి.కొత్తకోట : బి.కొత్తకోట నగర పంచాయతీ కార్యాలయంలో మున్సిపల్ శాఖ అనంతపురం రీజనల్ డెప్యూటీ డైరెక్టర్ పీవీవీఎస్ మూర్తి ఆడిటర్లతో కలిసి మంగళవారం తనిఖీలు చేపట్టారు. అక్రమాలు జరిగాయని వచ్చిన ఫిర్యాదులపై ఆయన స్పందించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో అవకతవకలపై విచారణ చేసి, ఎవరెంత తిన్నారో లెక్క తేల్చి వసూలు చేస్తామని తెలిపారు. మున్సిపల్ నిబంధనల మేరకు టౌన్‌ప్లానింగ్ విభాగం అనుమతులు, ఆర్థికపరమైన కార్యకలాపాలన్నీ ఆన్‌లైన్‌లో జరగాలి, చెల్లింపులు, వసూళ్ల నిబంధనల ప్రకారం జరగాలి, ఆఫ్‌లైన్‌లో నిర్వహించరాదన్నారు. అయితే వసూలు చేసిన పన్నులకు జారీ చేసిన రశీదులకు చెల్లించిన నగదు కార్యాలయంలో జమ కాలేదంటూ పలువురు ఫిర్యాదు చేశారని చెప్పారు. దీనితో 2021 జనవరి ఒకటి నుంచి 2022 జూలై వరకు ఆఫ్‌లైన్‌లో జరిగిన కార్యకలాపాలన్నింటిపైనా సమగ్ర విచారణ చేపట్టామని చెప్పారు. పంచాయతీ పాలనలో అప్పటి సిబ్బంది రూ.72 లక్షలు తిన్నట్టు గుర్తించగా మొత్తం తిరిగి వసూలు చేయడం జరిగిందన్నారు. నగర పంచాయతీ ఏర్పడిన తొలి ఆర్థిక సంవత్సరంలో వసూలు చేసిన సొమ్ము జమ కాలేదన్న ఆరోపణలు వచ్చాయన్నారు. ఇందులో ఏ మేరకు స్వాహా జరిగిందో విచారణ చేసి బాధ్యుల నుంచి రికవరీ చేసిన తర్వాత చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. దీనికోసం ఆడిటర్లతో కలిసి రికార్డులు పరిశీలిస్తున్నామని చెప్పారు. ప్రత్యేక సిబ్బందితో పన్నుల వసూళ్లపై సర్వే నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి రోజూ వసూలు చేసిన సొమ్మును మరుసటి రోజు బ్యాంకులో జమ చేశారా లేదా అని పరిశీలిస్తామన్నారు. దీనికి సంబంధించిన రికార్డులను సమగ్రంగా పరిశీలిస్తున్నట్టు చెప్పారు. కమిషనర్ నరసింహాప్రసాద్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అన్ని పనులు ఆన్‌లైన్‌లో సాగుతున్నాయని, దీనిపై ఎలాంటి ఇబ్బందులు తలెత్తడం లేదన్నారు. సమావేశంలో కమిషనర్ నరసింహాప్రసాద్, మేనేజర్ రమాదేవి పాల్గొన్నారు.

అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

బి.కొత్తకోట నగర పంచాయతీ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆర్‌డీడీ పీవీవీఎస్ మూర్తి కమిషనర్ పలసాని నరసింహాప్రసాద్‌ను ఆదేశించారు. ఐదు సచివాలయాల పరిధిలో చేపట్టాల్సిన మురుగునీటి కాలువలు, రోడ్లు, నీటి సరఫరాపై ప్రణాళికలు తయారు చేయాలని కోరారు.

ఆడిటర్లతో పరిశీలన

2021–22 ఆర్థిక సంవత్సరంలో జరిగిన వసూళ్లు, చెల్లింపులపై ఆడిటర్లతో ఆర్‌డీడీ మూర్తి పరిశీలనలు జరిపారు. కొన్ని రోజులుగా నిధుల వ్యయం, వసూళ్లకు సంబంధించిన రికార్డులను ఆడిటర్లు పరిశీలిస్తున్నారు. ఆడిటర్ల పరిశీలనలో తేలిన అంశాలు, రికార్డుల్లో పేర్కొన్న అంశాలపై చర్చించి తేడాలు, అవకతవకలను గుర్తించినట్టు తెలిసింది.

సచివాలయాల స్థాయి మార్పు

బి.కొత్తకోట: నగర పంచాయతీ పరిధిలోని ఐదు గ్రామ సచివాలయాలు త్వరలో వార్డు సచివాలయాలుగా మారనున్నట్టు మున్సిపల్ శాఖ అనంతపురం ఆర్‌డీడీ పీవీవీఎస్ మూర్తి అన్నారు. మంగళవారం బి.కొత్తకోట నగర పంచాయతీ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహించేందుకు ఆసక్తిగా కలిగిన ఉద్యోగులను మున్సిపల్ సిబ్బందిగా గుర్తించడం జరుగుతుందని చెప్పారు. లేనిపక్షంలో ఉద్యోగులు గ్రామ సచివాలయలకు వెళ్లవచ్చని సూచించారు. ఉద్యోగులు తమ సచివాలయాల పరిధికి చెందిన అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. సమస్యలను పరిష్కరించే విషయంలో క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ పలసాని నరసింహా ప్రసాద్, మేనేజర్ రమాదేవి, ఏఈ ఆంజనేయులు, టీపీఎస్ చిన్నరెడ్డెమ్మ, ఆర్‌ఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



విశ్వనాథ్ (ఫైల్)

మదనపల్లె : మండలంలోని అంకిశెట్టిపల్లె పంచాయతీ గాంధీపురానికి చెందిన విశ్వనాథ్(42) కొన్ని రోజులుగా కనిపించకపోవడంతో తండ్రి నాగరాజు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విశ్వనాథ్ పట్టణంలో ఆటోమొబైల్స్ షాపు నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. వ్యాపార అవసరాలపై పలువురి వద్ద అప్పులు చేశాడు. అయితే వ్యాపారంలో నష్టాలు రావడంతో అప్పులు తీర్చలేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో జనవరి 31న మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై దాడి : కేసు నమోదు

కలికిరి : మహిళపై దాడి కేసులో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ మనోహర్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గుండ్లూరు గ్రామం కొర్నమిట్టపల్లికి చెందిన నీరజ(30)కు చెందిన పశువుల మేత విషయమై అదే గ్రామానికి చెందిన సాయికుమార్, మునిరామయ్య, రెడ్డికుమారి, లక్ష్మీవరప్రసాద్ తగాదా పడి దాడి చేసి గాయపరచారు. గాయాలైన నీరజను కుటుంబ సభ్యులు కలికిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు మంగళవారం నీరజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన శివకుమార్

మదనపల్లె : మనస్తాపంతో వ్యక్తి పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మదనపల్లె మండలం పోతబోలు పంచాయతీ దిగువగాండ్లపల్లెలో జరిగింది. గ్రామానికి చెందిన వై.శివకుమార్ (45) వ్యవసాయం చేసుకుని జీవనం సాగించే వాడు. ఆయనకు 18 ఏళ్ల క్రితం కర్ణాటకలోని చింతామణికి చెందిన అర్చనతో వివాహమైంది. కుటుంబ విషయమై జరిగిన వివాదంలో భార్య అర్చన వారంరోజుల క్రితం చింతామణికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన అతను ఈ నెల 6న ఇంట్లో పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అపస్మారక స్థితిలో ఉన్న శివకుమార్‌ను అతడి సోదరి రెడ్డెమ్మ మదనపల్లెలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్సలు పొందుతూ మంగళవారం మృతి చెందాడు. రూరల్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సర్దార్‌హుస్సేన్ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ప్రపంచానికి మార్గదర్శి మరియమాత



దైవ సందేశం అందజేస్తున్న ఫాదర్ బెన్ని

కడప కల్చరల్ : ప్రపంచ మానవాళికి మరియమాత మార్గదర్శకురాలని, ఆమెను ఆరాధించి మన విశ్వాసాన్ని చాటుకోవాలని ఏలూరు జ్ఞాన కేంద్రం డైరెక్టర్ ఫాదర్ బెన్ని అన్నారు. కడప నగరం మరియాపురం పాత చర్చి వద్ద నిర్వహిస్తున్న లూర్దు మాత తిరునాలలో ఆరవ రోజు కార్యక్రమంలో భాగంగా ఆధ్యాత్మిక సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రధాన ప్రసంగం చేశారు. తొలుత చిత్తూరు విచారణ గురువు ఫాదర్ సగిలి ప్రకాశ్ దివ్య బలిపూజ సమర్పించారు. ఈ సందర్భంగా తొలుత మరియాపురం వీధుల్లో మరియమాత స్వరూపాన్ని పల్లకీపై ఉంచి విశ్వాసులు ఊరేగింపుగా ప్రధాన వేదిక వద్దకు తెచ్చారు. అక్కడ ప్రత్యేక అలంకారం చేసి మాత స్వరూపాన్ని ఏర్పాటు చేశారు. చిత్తూరు విచారణ గురువులు సగిలి ప్రకాశ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా, తిరునాల కమిటీ అధ్యక్షులు వారాధి జోసెఫ్, ఉపాధ్యక్షులు పి.విజయ్‌కుమార్, కార్యదర్శి లూర్దు, కోశాధికారి యు.విజయ్‌కుమార్‌లు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. నందిమండలం విజయరాజు ఆధ్వర్యంలో క్రైస్తవ మహిళలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. వీమల సిస్టర్స్ పీఠం అలంకరణ చేయడంతోపాటు పెద్ద చర్చి గాయక బృందంతో కలిసి స్తుతి గీతాలు ఆలపించారు.

రైతు ఆత్మహత్యాయత్నం

దువ్వూరు : దువ్వూరులోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రైతు తిప్పలూరు నాగిరెడ్డి పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అతన్ని వెంటనే పోలీసులు 108 వాహనంలో చికిత్స కోసం ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను నాగిరెడ్డి కుమారుడు సుబ్బారెడ్డి, కోడలు లక్ష్మీదేవి తెలిపారు. చాపాడు మండలం మొరాయిపల్లె గ్రామానికి చెందిన తిప్పలూరు నాగిరెడ్డికి దువ్వూరు మండలం చింతకుంట రెవెన్యూ గ్రామంలో రెండు ఎకరాల పొలం ఉందన్నారు. ఈ పొలానికి సంబంధించి నాగిరెడ్డికి, ఆయన తమ్ముడు రామచంద్రారెడ్డికి తగదాలు ఉన్నాయని చెప్పారు. జాయింట్ కలెక్టర్ వద్ద, ప్రొద్దుటూరు కోర్టులో ఈ కేసు నడుస్తోందని పేర్కొన్నారు. రెండు ఎకరాల పొలం ఆన్‌లైన్‌లో నాగిరెడ్డి పేరుతోనే ఉందని, ఈ భూమిని తన పేరు మీద ఆన్‌లైన్ చేయాలని తిప్పలూరు రామచంద్రారెడ్డి రెవెన్యూ అధికారుల వద్ద మ్యూటేషన్‌కు దరఖాస్తు చేశారన్నారు. ఆ మ్యూటేషన్‌ను రద్దు చేయాలని రెవెన్యూ అధికారులను కోరామని తెలిపారు. కానీ రెవెన్యూ అధికారులు అతని వద్ద లంచం తీసుకుని, అతని పేరున ఆన్‌లైన్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.